క్లుప్తంగా

ఎన్‌సీసీ విద్యార్థికి ప్రశంసా పత్రం అందజేత



విద్యార్థికి ప్రశంసా పత్రం అందజేస్తున్న బీసీ గురుకులాల కార్యదర్శి బి. సైదులు

నాగార్జునసాగర్: తమిళనాడులోని తంజావూరులో ఏర్పాటు చేసిన నేషనల్ ఇంటిగ్రేటెడ్ క్యాంప్(ఎన్‌ఐసీ)లో పాల్గొని వచ్చిన బీసీ గురుకులం డిగ్రీ కళాశాల విద్యార్థికి మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి బి.సైదులు ప్రశంసపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవి, వైస్ ప్రిన్సిపాల్ రఘు, ఎన్‌సీసీ ప్రోగ్రాం ఆఫీసర్ లలిత, సత్యనారాయణ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలి

మిర్యాలగూడ టౌన్ : విద్యాశాఖకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలని తెలంగాణ మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు ఉన్నతాధికారులను కోరారు. ఆదివారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో పీఎం శ్రీ పథకం కింద మంజూరైన నిధులను జిల్లా విద్యాశాధికారి ఏ బడిలో కుడా టాయిలెట్లు, మంచినీటి వసతులు ఏర్పాటు చేయకుండా, విద్యార్థులను టూర్‌కు తీసుకెళ్లకుండా కేంద్రం నుంచి వచ్చిన నిధులు డీఈకో సంబంధిత హెచ్‌ఎంలు, ఎంఈఓలు. కాంప్లెక్స్ హెచ్‌ఎంల ట్రైనింగ్‌ల పేరుతో ఖర్చులు చేసిన నిధులపై విచారణ చేపట్టాలన్నారు. మధ్యాహ్న భోజనం తనిఖీల పేరుతో పాఠశాలలకు వెళ్తూ అక్కడి లోపాలను గుర్తించి డబ్బులు గుంజడం ఆయనకు ఆనావాయితీగా మారిందన్నారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మాడుగులపల్లి : అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్న సంఘటన మండలంలోని కల్వలపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కల్వలపాలెం పాలేరు వాగు నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా అదే గ్రామానికి చెందిన ఉప్పునూతల నాగరాజు, చిట్యాల ప్రవీణ్, చిట్యాల సురేష్‌లు తమ ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారంతో ఆ మూడు ట్రాక్టర్లను ఇందుగుల గ్రామ శివారులో పట్టుకోని స్టేషన్‌కు తరలించామన్నారు. ఈ మేరకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జీఓ నంబర్ 25ను సవరించాలి

నల్లగొండ : జీఓ నంబర్ 25ను సవరించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు కాలం నారాయణరెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో 10 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు, 10 నుంచి 60 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులను ఇచ్చి ప్రాథమిక పాఠశాలలను బలో పేతం చేయాలనడం సమంజసంగా లేదన్నారు.

ఆర్థికసాయం అందజేత

శాలిగౌరారం: తీవ్ర అనారోగ్యానికి గురై చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ నార్కట్‌పల్లి కామినేని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఇటుకులపహాడ్ గ్రామానికి చెందిన పొన్న పుష్పలతకు గ్రామానికి చెందిన ఉద్యోగుల సంఘంతోపాటూ గ్రామస్తులు ఆదివారం రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించారు. రెక్కాడితేనే డొక్కాడే నిరుపేద కుటుంబానికి చెందిన పొన్న జోగయ్యకు భార్య పుష్పలతతో పాటూ అవివాహితులైన కుమారుడు, మానసిక వికలాంగురాలైన కుమార్తె ఉన్నారు. జోగయ్య కుటుంబ పరిస్థితిని చూసి చలించిన గ్రామస్తులు ఆర్థిక సహాయాన్ని అందించారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

చండూరు : గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం చండూరు మండల పరిధిలోని బంగారిగడ్డ గ్రామంలో నిర్వహించిన సీఐటీయూ మండల మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కనీస వేతనం ఇస్తామని, మల్టీ పర్పస్ విధానం రద్దు చేస్తామని అర్హత కలిగిన వారిని పర్మినెంట్ చేస్తామని ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా ఏ సమస్య పరిష్కరించలేదన్నారు. ఈ నెల 18న కనగల్‌లో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య, మండల కన్వీనర్ ధనుంజయ్, సైదులు, వెంకటాచారి, కృష్ణయ్య, ధనమ్మ, లింగయ్య, సత్తిరెడ్డి, పాల్గొన్నారు.

ఆహ్లాదం పంచని చిల్డ్రన్ పార్కులు

- నిరుపయోగంగా మారిన పార్కులు
- మరమ్మతులకు గురవుతున్న క్రీడా పరికరాలు
- నిర్వహణ మరిచిన అధికారులు



పార్క్‌లో ధ్వంసమైన క్రీడా పరికరాలు

దేవరకొండ : లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన చిల్డ్రన్ ప్లే పార్క్‌లు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారుతున్నాయి. గత ప్రభుత్వం పట్టణ ప్రగతి నిధుల నుంచి దేవరకొండ మున్సిపాలిటీలో రెండు చిల్డ్రన్ ప్లే పార్క్‌లు ఏర్పాటు చేశారు. చిల్డ్రన్ ప్లే పార్క్‌లో చిన్నారులు ఆడుకునేందుకు వివిధ ఆట పరికరాలు, ఆహ్లాదాన్ని పంచేందుకు గాను చెట్లను ఏర్పాటు చేశారు. పార్క్‌లో నిర్వహణ లోపంతో ఆహ్లాదం పంచే పరిస్థితి లేదు. దేవరకొండ మున్సిపాలిటీలో సంజయ్‌కాలనీ, ముత్యాలమ్మ బజార్‌లో ఏర్పాటు చేసిన పార్క్‌ల్లో చిన్నారులు ఆడుకునే ఆటవస్తువులు ధ్వంసం కాగా పార్క్‌లు చెత్తా చెదారంతో దర్శనమిస్తున్నాయి. లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన చిల్డ్రన్ ప్లే పార్క్‌లు ప్రస్తుతం నిరుపయోగంగా కన్పిస్తున్నాయి. ఏర్పాటు చేసిన కొన్ని రోజులు బాగానే ఉన్నా రాను రాను నిర్వహణ లేకపోవడంతో చిన్నారుల ఆట పరికరాలు సైతం ధ్వంసం అవుతున్నాయి. కాగా గుర్తు తెలియని వ్యక్తులు పరికరాలను ధ్వంసం చేస్తుండడంతో నిర్వహణ కష్టతరంగా మారినట్లు సంబంధిత మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. దేవరకొండ పట్టణంలోని ముత్యాలమ్మ బజార్, సంజయ్‌కాలనీల్లో గత ప్రభుత్వం పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా ఒక్కో పార్క్‌కు రూ.10లక్షల చొప్పున నిధులు వెచ్చించి రెండు చిల్డ్రన్స్ పార్క్‌లను ఏర్పాటు చేశారు. ఇందులో చిన్నారులు ఆడుకునేందుకు ఆట వస్తువులను అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం అవి మరమ్మతులకు గురై నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం ఒక్కో పార్క్ మరమ్మతుకు దాదాపు రూ.4లక్షల మేర నిధులు అవసరం ఉన్నట్లు సంబంధిత అధికారులు అంచనా వేస్తున్నారు. నిధుల మంజూరుకు సైతం మున్సిపల్ అధికారులు నివేదికలు పంపినట్లు తెలుస్తుంది. కాగా పార్క్‌ల వద్ద పర్యవేకకులు లేకపోవడంతోనే ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైన పార్క్‌లను వినియోగంలోకి తీసుకొచ్చి చిన్నారులకు ఆహ్లాదం అందేలా అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకొస్తాం



మున్సిపాల్టీ పరిధిలో గల అన్ని పార్క్‌ల నిర్వహణపై దృష్టి సారిస్తున్నాం. పట్టణంలోని ముత్యాలమ్మ బజార్, సంజయ్‌కాలనీలో గల చిల్డ్రన్స్ పార్క్‌లలో ఆట వస్తువులు దెబ్బతిన్నాయి. వాటి స్థానంలో నూతన ఆట వస్తువులు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందుకు సంబంధించి నిధుల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. చిల్డ్రన్ ప్లే పార్క్‌లను అందుబాటులోకి తీసుకొచ్చి ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నాం.

– రాజు, ఏఈ, మున్సిపాలిటీ

బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయం



డిండి : గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్

కొండమల్లేపల్లి : రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ తెలంగాణ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గుడిపల్లి మండలం గణపురం గ్రామానికి చెందిన పలువురు వేర్వేరు పార్టీల నుంచి మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం పార్టీలో చేరిన వారికి బీఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ తోటకూరి పరమేష్, కటికనేని యాదవరావు, కునెరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, కస్తూరి యాదగిరి, అద్దంకి దానబాబు, మైనం లింగయ్య, నాయిని రాఘవేంద్రరావుతో పాటు 150 కుటుంబాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఎల్గూరి వల్లపు రెడ్డి, మునగాల అంజిరెడ్డి, అర్వపల్లి నర్సింహ్మా,నిమ్మల విష్ణువరదన్, సుధాకర్‌గౌడ్, బొడ్డుపల్లి మహేందర్, శ్రీను, దూదిపాల విష్ణువర్ధన్‌రెడ్డి, గోలి గిరి, ఎర్ర యాదగిరి, సత్తయ్య,రాంబాబు, లాజర్, అనిల్ తదితరులుపాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లి : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. ఆదివారం గుడిపల్లి మండలంలోని ఘనపురం గ్రామంలో సుమారు 100కుటుంబాలు కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన వారిలో కునెరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, తోటకూరి పరమేష్‌యాదవ్, కటికనేని మాధవరావు, కస్తూరి యాదగిరి, అందంకి ధానబాబు, మైనం లింగయ్య, నాయిని రాఘవేంద్రలతో పాటు 100 కుటుంబాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎల్గూరి వల్లపురెడ్డి, మునగాల అంజిరెడ్డి, అర్వపల్లి నర్సింహ, మాద సుధాకర్‌గౌడ్, రాయినబోయిన శ్రీను, ఎర్ర యాదగిరి, విష్ణువర్ధన్ రెడ్డి, సత్తయ్య, రాంబాబు, లాజర్ పాల్గొన్నారు.



కొండమల్లేపల్లి : బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న రవీంద్రకుమార్

డీఎస్పీ ఉద్యోగం పొందిన శ్రీకాంత్‌కు సన్మానం

గుర్రంపోడు : మండలంలోని జిన్నాయిచింత గ్రామానికి చెందిన ముడుసు శ్రీకాంత్ ఇటీవల గ్రూప్–1 ఫలితాల్లో డీఎస్పీగా ఉద్యోగం పొందాడు. ఈ సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని నవోదయ ఉన్నత పాఠశాల యాజమాన్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యాసంస్థ కరస్పాండెంట్ వి. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివినప్పటి నుంచి ఎంతో క్రమశిక్షణతో చదివే శ్రీకాంత్ పట్టుదలతో చదివి డీఎస్పీగా ఎంపికవ్వడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వడ్డిరెడ్డి నర్సింహ్మారెడ్డి, వెంకటనారాయణ, పన్నాల గోపాల్, సత్యం, జహంగీర్, శ్రీనివాస్, స్వప్న, నేహ, చంద్రమోహన్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులపై వేధింపులు ఆపాలి

చండూరు : చిరు వ్యాపారులపై మున్సిపల్ అధికారులు చేస్తున్న వేధింపులు ఆపాలని సీఐటీయూ చండూరు మండల కన్వీనర్ జెర్రిపోతుల ధనుంజయ్ హెచ్చరించారు. ఆదివారం చండూరు పట్టణంలో నిర్వహించిన చిరు వ్యాపారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 30 సంవత్సరాలుగా తోపుడు బండ్లు, డబ్బాకొట్లు పెట్టుకొని జీవనం సాగిస్తున్న నిరుపేదలను.. రోడ్డు వెడల్పు పేరుతో తొలగించాలని వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. సోమవారం చండూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో చిరు వ్యాపారుల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇరిగి యాదయ్య, గంట యాదగిరి, నాయకులు దేవయ్య, వాజిద్, నరసింహ, నాగరాజు, రమేష్, అంజమ్మ, పూలమ్మ, వాణి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధోత్సవం

డిండి : కుల మతాలకతీతగా కోరిన కోర్కెలు తీర్చే దైవంగా పేరున్న నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండలోని శ్రీ హజ్రత్ ఖాజా సయ్యద్ షా యూసుపొద్దిన్ చిష్తి మిర్జా ఖలందరి దర్గా వద్ద ఉర్సు కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఆదివారం మండల కేంద్రం నుంచి దర్గా శిష్య బృందం గంధాన్ని ఘనంగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక మహబూబ్‌సుహానీ వద్ద ఫాతియాలు నిర్వహించిన అనంతరం విద్యుత్ దీపాలు, పూలమాలతో అలంకరించి భక్తి పాటల నడుమ గంధాన్ని ఊరేగించి దర్గా వద్దకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షుడు బాబా షర్ఫొద్దిన్, ప్రధానకార్యదర్శి బి.వెంకటయ్య, చాంద్‌పాషా, చంద్రయ్య, గంగాదర్, బచ్చలు, నారయ్య, కర్ణాకర్‌రెడ్డి, సైదులు, అంజి, మల్లయ్య, బాలస్వామి, యాదగిరి, భాస్కర్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.



గంధాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్‌లు



గుర్రంపోడులో డబ్బాల మధ్యలో చేతికి అందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్ తీగలు



ఆర్‌అండ్‌బీ బంగ్లా ముందు ఇరుకైన డబ్బా కొట్ల మధ్య ట్రాన్స్‌ఫార్మర్

గుర్రంపోడు : మండలకేంద్రంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు రక్షణ వలయాలు లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయి. నాంపల్లి రోడ్డులో తహసీల్దార్ కార్యాలయం ఎదుట భాగంలో రోడ్డు పక్కన కింద వర్షపు నీరు నిలిచి ఏబీ స్విచ్ వైర్లు చేతికందే ఎత్తులో ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్‌కు అనుకొని రెండు వైపులా డబ్బా కొట్టు ఉంది ఎవరికైనా ఏమరపాటుగా ఉంటే వైర్లు తగిలేలా ఉన్నాయి. ప్రధాన రహదారి వెంట ఉన్న విద్యుత్ తీగలు గాలికి ఒకదానికొకటి తగిలి ప్రమాదకరంగా ఉన్నాయి. ఇక ఆర్‌అండ్‌బీ బంగ్లా ఎదుట డబ్బా కొట్ల మధ్యలో ఇరుకైన స్థలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఏబీ స్విచ్ ఆన్ ఆఫ్ చేయడానికి కూడా స్థలం లేదు. ట్రాన్స్‌ఫార్మర్ కాలితే తీసుకునిపోవడానికి డబ్బాల ముందు రేకులు తొలగించాల్సిందే. మండలకేంద్రంలో ఎత్తైన పిల్లర్ల మీద ఉండాల్సిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కనీస రక్షణ వలయాలు లేకుండా ఇలా ప్రమాదకరంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ విషయమై విద్యుత్ ఏఈ శ్రీకాంత్‌రెడ్డిని ప్రశ్నించగా ట్రాన్స్‌ఫార్మర్లకు ఫ్లింత్‌లు ఏర్పాటు చేయడానికి నిధుల కొరత ఉందని, నిధులు మంజూరుకాగానే ఎత్తులో ఏర్పాటు చేస్తామని అన్నారు.

శిథిలావస్థలో ఆరోగ్య ఉపకేంద్రం



శిథిలావస్థకు చేరిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవనం

నిడమనూరు : నాలుగు దశాబ్దాల భవనం.. పలు ప్రభుత్వ కార్యాలయాలకు ఆశ్రయమిచ్చి ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. నిడమనూరు మండలంలోని తుమ్మడం గ్రామపంచాయతీ పాత భవనం నూతన భవనం నిర్మించడంతో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంగా, పశువుల ఆస్పత్రి కొనసాగుతుంది. ఆరోగ్య ఉపకేంద్రానికి కొత్త భవనం నిర్మిస్తుండగా, పశువుల ఆస్పత్రికి పలు పర్యాయాలు కొత్త భవనానికి ప్రతిపాదనలు, మంజూరైనప్పటికీ భవన నిర్మాణానికి ముందడుగు పడడం లేదు. ఇప్పటికైన ఆరోగ్య ఉపకేంద్రం భవనం ప్రారంభించి, పాత భవనం స్థలంలో కొత్త పశువుల ఆస్పత్రి భవనం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

పేద విద్యార్థినికి చేయూత

గట్టుప్పల్ : మండలంలోని వెల్మకన్నె గ్రామానికి చెందిన భీమనపల్లి యాదయ్య కూతురు కావ్య నీట్‌లో 393వ ర్యాంకు సాధించినప్పటికీ పేదరికం కారణంగా ఎంబీబీఎస్ చదవలేకపోతోంది. విషయం తెలుసుకున్న తేరట్‌పల్లి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు వీరమళ్ల శ్రీశైలం కావ్యకు తన వంతుగా ఆదివారం రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నామని జగన్నాథం, వెంకట రమణారెడ్డి, బీమగాని మల్లేశం, గ్రామ శాఖ అధ్యక్షుడు షేక్ నూర్ మహమ్మద్, రావుల పర్వతాలు, భీమనపల్లి లింగస్వామి, బీరప్ప, చాపల మారయ్య, శంకరయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీశైలం

ఆయుర్వేద వైద్య కేంద్రం ఏర్పాటు అభినందనీయం

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



ఈదులగూడెంలో ఆయుర్వేద సహజ వైద్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : పట్టణంలో ఆయుర్వేద సహజ వైద్య కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలోని ఈదులగూడలో ఆయుర్వేద సహజ వైద్య కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆయుర్వేదంతో ఎన్నో మొండి రోగాలకు శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు తెలిపారు. వ్యాధులతో బాధపడే వారు ఆయుర్వేద వైద్య చికిత్స తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయుర్వేద వైద్యులు సుమారు 150మంది రోగులకు ఉచిత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ముదిరెడ్డి నర్సిరెడ్డి, ప్రాచీన నాడి వైద్య నిపుణులు డాక్టర్ మహమ్మద్ రఫీ, ఫౌండర్ ఆఫ్ ఇరవేద ఎంఎస్.అర్జున్, అబ్దుల్ సలీం, సయ్యద్ రిజ్వాన, సకీనా, కృష్ణప్రసాద్, ఫైజాన్, రావు ఎల్లారెడ్డి, మర్రి ఎలియాస్ పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి



సాగర్ రోడ్డులో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ నేతలు

మిర్యాలగూడ టౌన్ : బీసీలక స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లలను నిలుపుదల చేయడాన్ని నిరసిస్తూ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో సాగర్‌రోడ్డులోని మహాత్మాజ్యోతిబా పూలే విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీ ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ కన్వీనర్ మారం శ్రీనివాస్, బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రాపోలు పరమేష్ మాట్లాడుతూ బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కోర్టు నిలుపుదల చేయడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ బీసీ సంఘాల నాయకులు కోల సైదులు, తిరుమలగిరి అశోక్, మురళియాదవ్, జయరాజు, గుడిపాటి కోటయ్య, నల్లగంతుల నాగభూషణం, నాయుడు, భాస్కర్, నేతి సత్యనారాయణ, రంజిత్ బాబు, వెంకటేశ్వర్లు, అంజిబాబు, సైదాచారి, ఈశ్వరాచారి, క్రాంతి, శ్రీనివాస్, తన్నీరు పాండురంగయ్య, సైదులు, కాశీ యాదవ్, లక్ష్మినారాయణ, రాంబాబు, హరికృష్ణ, ఉపేందర్, వెంకటేశ్వర్లు, బిక్షం, సైదయ్యాయ, సోమలింగం పాల్గొన్నారు.

వైన్స్‌షాపుల్లో బినామీలు ఉండొద్దు



మాట్లాడుతున్న గౌడ సంఘం నాయకులు

అడవిదేవులపల్లి : గౌడ కులస్తులకు కేటాయించిన వైన్‌షాపుల్లో బినామీలు ఉండొద్దని బీసీ విద్యార్థి సంఘం నాయకుడు గాదగోని మహేశ్‌గౌడ్ అన్నారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అడవిదేవులపల్లి మండలం నుంచి జరిగే మద్యం షాపుల లక్కీ డ్రాలో గౌడ కులస్తులందరూ హాజరు కావాలన్నారు. గౌడ కులస్తులను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అణగదొక్కుతుందన్నారు. రాష్ట్రంలో పలు చోట్ల రిజర్వ్ చేసిన గౌడ కులస్తులకు కేటాయించిన వైన్స్‌ల్లో మద్య దళారులు, బినామీలకు ఎలాంటి అవకాశం ఇవ్వవద్దన్నారు. దళారీ వ్యవస్థ, పెట్టుబడి వ్యవస్థలు గౌడ కులస్తులకు ఎంతో ఆశ చూపించి గౌడ కులస్తులకు కేటాయించిన వైన్స్‌ల్లో బినామీలుగా ఉండేవారి లైసెన్స్‌లను తక్షణమే రద్దు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు పెద్ది శ్రీనివాస్ గౌడ్, తిరుపతయ్య గౌడ్, గాలి వెంకటేశ్వర్లు, మట్టయ్య, ముత్యాలు, రాంబాబు, కనకయ్య, శ్రీనివాస్ తదితరులున్నారు.

సుమిత్రబాయికి నివాళి



సుమిత్రబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జాన్‌వెస్లీ, వీరభద్రం, రంగారెడ్డి, సుదర్శన్

మిర్యాలగూడ : సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ సతీమణి సుమిత్రబాయి సంతాప సభ మిర్యాలగూడలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమిత్ర మృతి వారి కుటుంబానికి తీరని లోటన్నారు. సంతాపం తెలిపిన వారిలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు నున్నా నాగేశ్వర్‌రావు, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, రవినాయక్, వినోద్‌నాయక్, శశిధర్‌రెడ్డి, పరుశురాములు, అయూబ్, వరలక్ష్మి, రాగిరెడ్డి మంగారెడ్డి, పారేపల్లి మోహన్‌రావు, వెంకట్‌రెడ్డి, ప్రకాశ్, అరుణ, గోవర్ధన, ఊర్మిళ, బంటు వెంకటేశ్వర్లు, కాశీ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కనీస వేతనం నిర్ణయించాలి



మాట్లాడుతున్న వీరారెడ్డి

నల్లగొండ టూటౌన్: మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రెండో పీఆర్సీలో రూ.26,000 అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండలో నిర్వహించిన తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 14,15 తేదీల్లో రంగారెడ్డి జిల్లా తుర్కయాంజిల్‌లో నిర్వహించనున్న యూనియన్ రాష్ట్ర మహాసభలకు కార్మికులు అధికంగా హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు యూనియన్ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సమావేశంలో చింతకాయల సంతోష్, శ్రీనివాస్, లక్ష్మమ్మ, పొట్ట తారమ్మ, ఎండీ.సలీం, దండెంపల్లి సత్తయ్య, అవుట రవీందర్, జక్కల రవికుమార్, వెంకన్న, శ్రీనివాస్, సంజీవ, కృష్ణ, రాములు, యల్లమ్మ, పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు



తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన వేంపాడు-గగినపల్లివారిగూడెం రోడ్డు



ఊట్కూరు రోడ్డు బ్రిడ్జి దిగువన ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు

నిడమనూరు : మండలంలోని పలు గ్రామీణ రహదారులు వర్షాలకు దెబ్బతిన్నాయి. వాగుల పరిధిలోని వేంపాడు నుంచి గగినపల్లి వారిగూడెం, కుమ్మరిగూడెం గ్రామాలకు వారం రోజులకుగా రాకపోకలు నిలిచిపోయాయి. అదే తీరులో నిడమనూరు–బంకాపురం రోడ్డులో ఆదర్శ పాఠశాల వద్ద లో లెవల్ కల్వర్టు పూర్తిగా దెబ్బతిన్నది. తుమ్మడం–పార్వతీపురం రోడ్డులో తుమ్మడం చిన్న చెరువు అలుగు ప్రవాహంతో దిగువన ఉన్న లో లెవల్ కల్వర్టు పలుచోట్ల ధ్వంసమైంది. దీంతో నాలుగైదు రోజులు రాకపోకలు నిలిచిపోయాయి. నిర్మాణంలో ఉన్న ఊట్కూరు బ్రిడ్జి దిగువన ఉన్న డైవర్షన్ రోడ్డుకు స్థానికంగా మట్టి తవ్వుకుంటున్న కాంట్రాక్టర్ బ్రిడ్జి మరమ్మతులు చేపట్టారు. మరోవైపు కొన్ని చోట్ల అధికారులు పట్టించుకోకపోవడంతో రానున్న స్థానిక ఎన్నికల్లో పోటీపడే ఆశావాహులు రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్నారు. ఇప్పటికైన పంచాయతీ, ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకొని పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



నిడమనూరు-బంకాపురం రోడ్డులో ధ్వంసమైన కల్వర్టు

క్లుప్తంగా

నేడు మాడుగులపల్లిలో పశువైద్య శిబిరం

మాడుగులపల్లి : మండల పశువైద్యశాల, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నేడు మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో ప్రత్యేక వైద్య శిబిరం, గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు నిర్వహించనున్నట్లు మండలం పశు వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ పశువైద్య శిబిరంలో గర్భకోశ వ్యాధులు ఉన్న పశువులకు ప్రత్యేక చికిత్స చేసి మందులు ఇస్తామని, ప్రతి పశువును పరిశీలించి ఆరోగ్య సమస్య ఉన్నట్లయితే చికిత్స అందిస్తామని తెలిపారు. దూడలకు, పశువులకు నట్టల నివారణ మందులు వేస్తామని, ఆవుల, గేదెల్లో చూడి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కావునా పాడి రైతులు, పశుపోషకులు తమ పశువులను పశు వైద్యశాలకు తీసుకొచ్చి పశువైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు.

మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించాలి

వేములపల్లి : ప్రభుత్వం మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలెబోయిన వరలక్ష్మీ, జిల్లా సహాయ కార్యదర్శి పాదూరు గోవర్ధనిలు అన్నారు. జనవరి 25, 26, 27, 28 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే ఐద్వా జాతీయ మహాసభల నేపథ్యంలో సోమవారం మండల కేంద్రంలో నిధి సేకరణను వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా ప్రభుత్వాలు మహిళలను ఇంకా రెండో తరగతి పౌరులుగా చూస్తున్నారన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను, హింసను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో అనిరెడ్డి మాధవి, శీలం పద్మ, తంగెళ్ల నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

త్రిపురారం : గ్రామాల్లో తక్కువ ధరకు రేషన్ బియ్యం కొని ఆటోలో తరలిస్తుండగా ఆ వ్యక్తిని త్రిపురారం పోలీసులు చాకచక్యంగా పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సోమవారం త్రిపురారం ఎస్ఐ గైకూరి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొర్రాయిపాలెం గ్రామానికి చెందిన గద్దల రాజీవ్ కుమార్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.ఈ క్రమంలో ప్రభుత్వం పేదలకు సరఫరా చేసే పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనగోలు చేశారు. కొనుగోలు చేసిన పీడీఎస్ బియ్యాన్ని తన సొంత ఆటోలో నింపుకొని ముల్కచర్ల నుంచి త్రిపురారం వైపు వస్తుండగా పోలీసులు సత్యనారాయణ పురం వద్ద 7బస్తాల రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటోను పటుకొని ఆటో, బియ్యాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. రేషన్ బియ్యం తరలించే వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దాతల సహకారం అభినందనీయం

పెద్దవూర: మారుమూల ప్రాంతాల్లో పేద విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలలకు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని మండల విద్యాధికారి తరి రాములు అన్నారు. మండలంలోని పులిచర్ల జెడ్పీహెచ్ఎస్‌లో చదువుకుంటున్న విద్యార్థులకు మిర్యాలగూడకు చెందిన ఓ దాత రూ.50వేలతో అందించిన స్పోర్ట్స్ డ్రెస్‌ను పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. పాఠశాల దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని నిత్యం సాధన చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కోరె సుదర్శన్, ఉపాధ్యాయులు సైదిరెడ్డి, నర్సిరెడ్డి, పీడీ కూతాటి దేశ్‌కుమార్, సీఆర్పీ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

నాగార్జునసాగర్ : డీఏవీ నేషనల్ స్పోర్ట్స్ స్టేట్ లెవల్ మీట్‌ను ఈనెల 10,11 తేదీల్లో హైదరాబాద్‌లోని సఫిల్‌గూడ డీఏవీ స్కూల్‌లో నిర్వహించారు. ఈ క్రీడా పోటీలలో పాల్గొన్న నాగార్జునసాగర్ డీఏవీ పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం పవన్‌కుమార్ తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరచి పతకాలను గెలుపొంది, జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను టీఎస్ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ మంగేష్‌కుమార్, ఎస్ఈ రామకృష్ణారెడ్డి, ఈఈ సత్యశివకుమార్, ఎస్ఏఓ శిరీష, డీఏవీ ఏఆర్ఓ జి.ఆర్.కె ప్రసాద్, పాఠశాల హెడ్‌మాస్టర్ పీఈటీ సాయికృష్ణ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

మాడుగులపల్లి : ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని ఐకేపీ సెంటర్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తే రైతులు ఆరబోసిన ధాన్యాం తడిసేది కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఊర ఎల్లయ్య, దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, మల్లారెడ్డి, పుల్లెంల శ్రీకర్, మన్యం భిక్షం, గవ్వ రవి, సీతారాంరెడ్డి, కాకులవరం నాని, నరేష్, కరుణాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి ఎదురుచూపులేనా..

- వేములవాగుపై ప్రారంభం కాని వంతెన పనులు
- శంకుస్థాపన చేసి రెండేళ్లు పూర్తి
- ఇబ్బందులు పడుతున్న . ధన్‌సింగ్‌తండా వాసులు


వాగుపై బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రదేశం

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : దేవుడు వరమిచ్చినా . పూజారి కనుకరించకపాయే అనే చందంగా ఉంది ధన్‌సింగ్‌తండా గ్రామస్తుల పరిస్థితి. ఆగ్రామానికి ఆనుకొని వేముల వాగు ప్రవహిస్తుంది. ఆ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరై, టెండర్ కూడా పూర్తయి రెండేళ్లు అవుతుంది. కానీ సంబంధిత కాంట్రాక్టర్ నేటికీ పనులకు అగ్రిమెంట్ చేయించుకోకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. వర్షాకాలంలో ఈ వాగు ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. రెతులు తమ పంట పొలాలకు వెళ్లాలంటే వాగు దాటడం ఇబ్బందిగా ఉంటుంది.

గతంలో ఐదుగురు చిన్నారులు మృతి

వాగుతండాను ఆనుకొని ప్రవహిస్తుండటంతో ఆ పక్కనే ప్రభుత్వ పాఠశాల సైతం ఉంది. తండాలోని చిన్నారులు ఆటలు ఆడుకుంటూ వాగులో పడి ఐదుగురు చిన్నారులు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. దీంతో వాగుపై బ్రిడ్జిని ఏర్పాటు చేసి వాగు చుట్టూ రిటర్నింగ్‌వాల్ చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. సమస్యను తండా వాసులు 2018 లో అప్పటి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవత్ రాథోడ్ దృష్టికి తీసుకెళ్లగా నాడు మంత్రి ఆదేశాల మేరకు ట్రైబల్ వెల్ఫేర్ ఎస్ఈ తండాను సందర్శించి వాగు పరిస్థితిని అంచనా వేసి వాగు, రిటర్నింగ్‌వాల్ నిర్మాణానికి గాను రూ. 2.70 కోట్లు ఖర్చవుతుందని ప్రభుత్వానికి నివేదిక అందించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు.

రూ.1.20 కోట్లతో పనులకు శంకుస్థాపన

ఆ తరువాత జరిగిన నాగార్జునసాగర్ ఉప ఎన్నికల్లో తండా వాసుల బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని మరోమారు డిమాండ్ చేయగా నాడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణాన్ని చేపడతామని హామీ ఇచ్చింది. ఈ హామీలో భాగంగా 2023 సెప్టెంబర్ లో అప్పటి ఎమ్మెల్యే నోముల భగత్ బ్రిడ్జి నిర్మాణానికి ఎస్డీఎఫ్ నిధుల ద్వారా రూ.1.20 కోట్లతో శంకుస్థాపన చేయగా ఆ తరువాత ప్రభుత్వం రిటర్నింగ్ వాల్ నిర్మాణానికి సీఆర్ఆర్ నిధులతో మరలా రూ. 36లక్షలు కేటాయించింది.

టెండర్ అగ్రిమెంట్ చేసుకోని కాంట్రాక్టర్

టెండర్ ద్వారా పనులను దక్కించుకున్న ఓ కాంట్రాక్టర్ పనులకు శంకుస్థాపన చేసి రెండేళ్లు దాటినా నేటికీ అగ్రిమెంట్ చేయించుకోకపోవడంతో అధికారులు పనులకు మార్కింగ్ వేయగానికి అవకాశం లేకుండా పోయింది. సదరు కాంట్రాక్టర్‌కు సంబంధిత శాఖ అధికారులు రెండుసార్లు నోటీసులు పంపినప్పటికీ అధికారుల నోటీసులను సైతం పెడచెవిన పెట్టడం గమనార్హం. పనులు ప్రారంభం కాకపోవడంతో సీఆర్ఆర్ నిధుల ద్వారా మంజూరైన రూ.36లక్షల నిధులు సైతం వెనక్కు వెళ్లిపోయాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమ కల నిర్మాణమైన బ్రిడ్జి నిర్మాణానికి పనులు ప్రారంభించాలని తండా వాసులు పేర్కొంటున్నారు.

పనులు ప్రారంభించాలి



వేములవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసి రెండేళ్లు అవుతున్నా నేటికీ పనులు ప్రారంభించకపోవడం సరికాదు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో మేము పడే ఇబ్బందులు వర్ణణాతీతం. పంట పొలాలకు వెళ్లాలన్నా వెళ్లలేని పరిస్థితి. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న బ్రిడ్జి నిర్మాణం పూర్తవుతుందని సంతోషపడితే ఇంకా ఎదురుచూపులుగానే ఉంది.

- మెగావత్ భాస్కర్ నాయక్

వర్షాకాలంలో ఇబ్బంది



వర్షాకాలం వస్తుందంటే వాగు ఎలా దాటాలి, పంట పొలాలకు ఎలా వెళ్లాలి అనే భయం. ఊరికి ఆనుకొని ప్రమాదకరంగా వాగు ఉంది. ఇప్పటి వరకు ఈ వాగులో పడి ఐదుగురు చిన్నారులు మృతి చెందారు. ఇప్పటికైనా త్వరగా పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసి మా సమస్యను పరిష్కరించాలి.

- మేగావత్ హనుమా నాయక్

రెండు సార్లు నోటీసులు ఇచ్చాం



కాంట్రాక్టర్ పనులకు అగ్రిమెంట్ చేయించుకోకపోవడంతో నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. అగ్రిమెంట్ చేయించుకొని పనులు ప్రారంభించాలని రెండుసార్లు నోటీసులు పంపినా స్పందించలేదు. కాంట్రాక్టర్ అగ్రిమెంట్ చేయించుకున్న వెంటనే మార్కింగ్ వేస్తాం.

- ఎన్, నర్సింహారెడ్డి, డీఈ, పంచాయతీరాజ్

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

- న్యాయమూర్తి అరుణ్ తేజ్


మాట్లాడుతున్న న్యాయమూర్తి అరుణ్ తేజ్

మిర్యాలగూడ టౌన్ : భారత రాజ్యాంగం బాలికలకు కల్పిస్తున్న హక్కులను సద్వినియోగం చేసుకోవాలని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి అరుణ్ తేజ్ అన్నారు. సోమవారం మిర్యాలగూడ మండలం అవంతిపురంలోని గిరిజన బాలికల గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ బాలికల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాలికలకు కల్పిస్తున్న హక్కులు, చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. పోక్సో, ర్యాగింగ్, బాల్యవివాహాలు, గృహహింస, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ వంటి తదితర చట్టాలను తెలుసుకోవాలన్నారు. అదే విధంగా ఏమైనా సమస్యలు ఉంటే పోలీస్ స్టేషన్ ద్వారా కోర్టు వరకు తీసుకురావచ్చన్నారు. బాలికలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. న్యాయం ఏ విధంగా పొందవచ్చు అనే అంశంపై కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యులు, న్యాయవాది దూపాటి మట్టయ్య, రాయారపు భాస్కర్, డి, రాజశేఖర్‌నాయక్, పద్మయ్య, బాలునాయక్, పారా లీగల్ వలంటీర్స్ మహేశ్వరి, రహీదాబేగం, ప్రమీల, ప్రిన్సిపాల్ సరిత తదితరులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించండి


ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌ను సన్మానిస్తున్న దశరథ్ నాయక్, దశరథ్‌రాథోడ్‌లు

మిర్యాలగూడ : తెలంగాణ రాష్ట్ర వైద్య విద్యార్థులకు పీజీ సీట్ల కేటాయింపులో జరుగుతున్న అన్యాయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ్‌నాయక్, కోదాడ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జటోతు దశరథ్‌రాథోడ్‌లు ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌ను కోరారు. సోమవారం వారు ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ నివాసానికి వెళ్లి ఆయనను సన్మానించి వైద్య విద్య పీజీ సీట్ల కేటాయింపులో జరుగుతున్న అన్యాయంపై వినతిపత్రం అందజేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కల్పించబడిన ఉమ్మడి హక్కుల ద్వారా ఎంబీబీఎస్ కోర్సులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పూర్తి చేస్తే ఇప్పుడు వాళ్లను నాన్ లోకల్ అని పీజీ సీట్లు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. పదేళ్ల కాలంలో వేలాది మంది విద్యార్థులు ఎంబీబీఎస్ పూర్తిచేసి పీజీ సీట్లు రాక నష్టపోతున్నారన్నారు. ఈ విషయంపై సీఎం, వైద్యారోగ్య శాఖ మంత్రి, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రవినాయక్, భీమ్లానాయక్, శ్రీనునాయక్, బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని వినతి


డీఈఓ భిక్షపతికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): విద్యాశాఖ ఆదేశాలు పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ సాగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం డీఈఓ భిక్షపతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ మాట్లాడారు. ప్రమోషన్‌లో భాగంగా ఖాళీ అయిన యల్లాపురం ప్రాథమిక పాఠశాలకు కూన్‌రెడ్డి సైదిరెడ్డి అనే ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్‌లో భాగంగా వెళ్లాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసినా పాటించకపోవడం బాధాకరమన్నారు. అలాగే సుంకిశాలతండాలో పనిచేస్తూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి ఉత్తర్వులు లేకుండా చందూరు మండలానికి అక్రమ డిప్యుటేషన్‌పై వెళ్లిన నవ్యశ్రీపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మూసివేసిన నెల్లికల్లు పాఠశాలకు శాలిగౌరారం నుంచి అక్రమంగా వచ్చిన ఒక ఉపాధ్యాయుడికి డిప్యుటేషన్ వేసి నాలుగు నెలలుగా డ్యూటీ మంజూరు చేయడం ఏంటని వారు ప్రశ్నించారు. వీటన్నిటిపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం నాయకులు కోరే రమేష్, మారపాక కిరణ్, మహేష్ తదితరులు ఉన్నారు.

జీవన నైపుణ్యంతోనే మంచి భవిష్యత్


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోకల వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ : విద్యార్థులు మంచి జీవన నైపుణ్యం అలవర్చుకున్నట్లయితే భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. అంతర్జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని విజేత మహిళా డిగ్రీ కళాశాలలో కేజీబీవీలో విద్యార్థినులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు, ఓర్పు, విశ్వాసంతో అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటేనే మంచి ఆలోచనలు కలిగి ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ ఆటలతో జీవితాలను చేజేతులా ఛిద్రం చేసుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గ్రీస్ దేశంలో ఉద్యోగాలకు దరఖాస్తులు

నల్లగొండ : గ్రీస్ దేశంలో హాస్పిటాలిటీ నిర్వహణ, సేవా రంగాల్లో ఉద్యోగాలు పొందటానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్.పద్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోటల్ మేనేజిమెంట్‌లో డిప్లొమా, ఎదైనా డిగ్రీ, ఆంగ్ల భాషా ప్రావీణ్యం ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఈ దరఖాస్తులను tomcom.resume@gmail.com మెయిల్‌కు పంపాలని ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు 9440052081 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ప్రజావాణిలో మున్సిపల్ కమిషనర్‌పై ఫిర్యాదు


ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న ఇనాం భూమి హక్కుదారులు

కొండమల్లేపల్లి : ఇనాం భూమిలో అక్రమ కట్టడాలు తొలగించాలని ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని దేవరకొండ మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఇనాం హక్కుదారులు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవరకొండ పట్టణంలోని ఏటీఎం వెనుక ఉన్న సర్వే నంబర్405లోని సయ్యద్ హజ్రత్ సులేమాన్ షావాలి ఖద్రి దర్గాకు చెందిన ఇనాం భూమిలో కొంతమంది వ్యక్తులు అక్రమంగా కట్టడాలు నిర్మించి చుట్టూ ప్రహరీ నిర్మించినట్లు తెలిపారు. వీటిని తక్షణమే తొలగించాలని గత నెల 15న దేవరకొండ మున్సిపల్ కమిషనర్‌కి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. కాని ఇంతవరకు కమిషనర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఈ భూమి వక్ఫ్ బోర్డుకు సంబంధించిందని తమకు ఎలాంటి సంబంధం ఉండదని తహసీల్దార్ చూసుకుంటాని సమాధానం చెబుతున్నట్లు తెలిపారు. గతంలో సర్వే నంబర్ 753లో ఉన్న వక్ఫ్ బోర్డు ఇనాం భూమిలో అక్రమ కట్టడాలు కడుతున్నపుడు కమిషనర్ తమ సిబ్బందితో వెళ్లి ఆ కట్టడాలను కూల్చి వేసినట్లు తెలిపారు. ప్రస్తుతం సర్వే నంబర్ 405లో అక్రమ ప్రహరీ గోడ విషయంలో మాత్రం చర్యలు తీసుకోవడం లేదని ఈ విషయంపై జిల్లా అధికారులు స్పందించి అక్రమ కట్టడాలను తొలగించేలా, మున్సిపల్ కమిషనర్‌పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో సయ్యద్ చాంద్, సిద్దిక్, ఫయాజ్, అంజాద్, ఖాజాపాషా, సయ్యద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


పెద్దవూర : పెద్దగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పెద్దవూర: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ ఏసీడీపీఓ సువర్ణ అన్నారు. సోమవారం మండలంలోని పెద్దగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో పోషన్ అభియాన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నారాయణరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికళ, ఉపాధ్యాయులు రేపాల అశోక్, చంద్రశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్, మధుబాబు, అంగన్‌వాడీ టీచర్లు సుమలత, కుసుమ పాల్గొన్నారు.

హాలియా : కిశోర బాలికలు రక్తహీనత బారినపడకుండా పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని చల్మారెడ్డిగూడెం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల హెచ్ఎం ప్రకాష్, సూపర్ వైజర్ సరిత అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అనుముల ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని చల్మారెడ్డి గూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శ్రీదేవి, విజయ, శ్రీదేవి, చల్మారెడ్డి గూడెం పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

మిర్యాలగూడ టౌన్ : వరి అన్నమే కాకుండా అన్ని రకాల చిరుధాన్యాల పోషకాహారం తీసుకుంటేనే ఎంతో మేలు జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సాగరయ్య అన్నారు. సోమవారం మిర్యాలగూడ మండలం బి.అన్నారం సెక్టార్ పరిధిలోని వెంకటాద్రిపాలెం ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పోషణ మాసం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కవిత, సునిత, శారధ, యశోధ, నసీమా సుల్తానా, హెల్పర్ సైదమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు దస్తగిరి, శైలజలతో పాటు గర్భిణులు, బాలింతలు తదితరులున్నారు.

కొండమల్లేపల్లి : గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సీడీపీఓ కత్తిజ బేగం అన్నారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా సోమవారం కొండమల్లేపల్లి ప్రాజెక్టు పరిధిలోని కొల్‌ముంతలపహాడ్ రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పోషకాహారంపై అవగాహన కల్పించారు. పోషకాహారం లోపం తగ్గించడానికి చిరుధాన్యాలు తీసుకోవాలని, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నాగేశ్వర్‌రావు, ఎంఓ ఉషారాణి, ఏపీఎం యాదయ్య, సూపర్‌వైజర్ సువర్ణ, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి


ఐకేపీ సెంటర్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కిసాన్ మోర్చా నాయకులు

మాడుగులపల్లి : మండలంలో ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి ఐకేపీ సెంటర్లలో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని ఐకేపీ సెంటర్‌లో వర్షానికి తడిసిన ల ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. రైతులు ఆరుగాలం కష్టించి పండించి ధాన్యాన్ని ఐకేపీ కేంద్రానికి తరలిస్తే అకాల వర్షానికి ధాన్యం తడిసిపోవడంతో రైతుల కళ్లలో కన్నీళ్లు మిగిలాయన్నారు. రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోమని పెద్ద ఎత్తున రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఇటికాల జాన్‌రెడ్డి, వంగూరు రవి, బుర్రి వెంకట్‌రెడ్డి, బుర్రి కలమ్మ, బాల్నె సత్యంరెడ్డి, తెలమల్ల సైదులు, వేముల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రజా ఉద్యమాలు : జూలకంటి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

మిర్యాలగూడ : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజా ఉద్యమాలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 నెలలుగా గ్రామాల్లో పాలన వ్యవస్థ లేకపోవడంతో అనేక సమస్యలు నెలకొన్నాయని దీనివల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల కోసం పోరాటాలు చేసే ఎర్రజెండా అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రవినాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, పిలుట్ల సైదులు, చౌగాని వెంకన్న, ఉన్నం వెంకటేశ్వర్లు, సైదమ్మ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసే కాంగ్రెస్‌లో చేరిక


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెద్దఅడిశర్లపల్లి : ప్రభుత్వం చేసే అభివృద్ధి పనులు చూసే కాంగ్రెస్‌లోకి చేరుతున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లయ్య అన్నారు. సోమవారం గుడిపల్లి మండలంలోని ఘణపురం గ్రామానికి చెందిన 50 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కుక్కల గోవర్ధన్‌రెడ్డి, ముచ్చర్ల ఏడుకొండల్‌యాదవ్, సతీష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ముచ్చర్ల, శ్రీకాంత్‌యాదవ్, సత్తయ్య, ఖాజావిఎయా, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

మిర్యాలగూడ టౌన్ : గౌడులకు కేటాయించిన వైన్స్ షాపులకు ఇతర ప్రాంతాలకు చెందిన గౌడ కులస్తుల పేరు మీద బినామీ టెండర్లు దాఖలు చేస్తున్నారని, వెంటనే వాటిని గుర్తించి రద్దు చేయాలని కోరుతూ సోమవారం పట్టణ కేంద్రంలో గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు గుండు శ్రీరాములు గౌడ్, ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల రాములు గౌడ్, నియోజకవర్గ అధ్యక్షుడు పెద్దిశ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకన్నగౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బసవయ్యగౌడ్ పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న గౌడ సంఘం నాయకులు

భారీ వర్షం.. నిలిచిన రాకపోకలు


నిడమనూరు : వరద ఉధృతికి కొట్టుకుపోయిన ఊట్కూర్ డైవర్షన్ రోడ్డు బ్రిడ్జి


త్రిపురారం : దుగ్గెపల్లి వద్ద లో లెవల్ వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వరద


కొండమల్లేపల్లి : కోల్‌ముంతలపహాడ్ కుంట అలుగుపోయడంతో రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వరద

త్రిపురారం : మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఆదివారం రాత్రి ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లోని రైతులకు పంట చేతికి వచ్చే సమయంలో పంట చేలు నీట మునిగాయి. ముకుందాపురం నుంచి తిప్పర్తి వెళ్ల రహదరిలో దుగ్గెపల్లి వద్ద చెరవు సమీపంలో లో లెవల్ బ్రిడ్జి మునిగిపోవడంతో వాహనరాకపోకలు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

గుర్రంపోడు : మండలంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పంటలకు తీవ్ర నష్టం జరిగింది. పలు గ్రామాల్లో చెరువులు అలుగులు పోస్తూ వరి చేలు నేలకొరిగాయి. ముమ్మరంగా జరుగుతున్న పత్తితీతలు నిలిచిపోయాయి. చాలా చోట్ల పండ్లతోటల్లో నీరు నిలిచింది.

నిడమనూరు : నిడమనూరు మండలవ్యాప్తంగా ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో 41 మిల్లీమీటర్ల వర్షం పడింది. పలు చోట్ల లో లెవల్ కల్వర్టులపై నుంచి నీరు ప్రవాహించింది. ప్రధానంగా నిడమనూరు ఊట్కూరు-నందికొండవారిగూడెం మధ్య నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి డైవర్షన్ రోడ్డు వరద ప్రవాహనికి మరోసారి కొట్టుకుపోయింది. ఇప్పటికే మూడు పర్యాయాలు సీసీ పైపులపై (గూనలు)పోసిన మట్టి వరదకు కొట్టుకపోయింది. దీంతో మరోసారి ఊట్కూరు-నంది కొండవారిగూడెం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. నిడమనూరు నల్లచోట చెరువు వరద ప్రవాహంతో బంకాపురం-నిడమనూరు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.


గుర్రంపోడు : చేపూరులో నీట మునిగిన మిర్చి పంట

కొండమల్లేపల్లి : కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని కొల్‌ముంతలపహాడ్ గ్రామపంచాయతీ పరిధిలోని రామునిగుండ్ల తండా, మంత్రియతండా, ఏపూర్‌తండాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కోల్‌ముంతలపహాడ్ కుంట పొంగడంతో రామునిగుండ్లతండాకు వెళ్లే రోడ్డు మార్గం నీళ్లతో నిండిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. ప్రభుత్వం, ఉన్నతాధికారులు చొరవ తీసుకొని రాకపోకలు నిలిచిపోయిన మార్గంలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.